క్లుప్తంగా

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి యశస్వి

పాలసముద్రం: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో ఉచిత పశు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామాల్లో ఉంటే వెటర్నరీ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా చేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు, పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో గోపాల మిత్ర నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

పాలసముద్రం: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయడంతోపాటు పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో వేరుశనగ తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తరచూ ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. పంట సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు చేయించు కోవాలన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువు వాడాలని సూచించారు. కత్తెర పురుగును తగు జాగ్రత్తలతో నివారించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పలు పంటలను ఆశించే పురుగులు తెగుళ్ల గురించి, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగు చేస్తే అందులో వస్తున్న బెల్లం తీసుకోవడానికి టీటీడీ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పంటలు పండించే విధానంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. వరి పంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దానిని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

పుత్తూరు: గ్రామాల్లో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు వివిధ గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వడమాలపేట ఎంపీడీఓ సుజాతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ఎస్.బి.ఆర్.పురం, ఏఎంపురం గ్రామాల్లో, 24న బాలినాయుడు కండ్రిగ, అప్పలాయగుంటలో, 25న పాదిరేడు, పత్తిపుత్తూరులో, 26న పూడి, వడమాలలో, 27న వడమాలపేట, ఎస్వీపురం గ్రామాల్లో మొబైల్ ఆధార్ తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డులో చిరునామా ఇతరత్రా మార్పులకు ఈ కేంద్రాల్లో అవకాశం ఉందన్నారు. ప్రత్యేకించి అంగన్‌వాడీ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నివారణపై అవగాహన

విజయపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు ఇంటింటికి పర్యటించి దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ దోమల నివారణతో మలేరియా, డెంగీ వ్యాపించకుండా ఉంటాయని తెలిపారు. మండలంలో జ్వరం కేసులు చాలా వరకు తగ్గాయన్నారు. స్టాప్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తల దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయని, వినియోగించుకోవాలని కోరారు. కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ఎవరికి ఎలా రాగి రంగులో మచ్చలు ఉన్నట్లయితే, గుర్తించి నమోదు చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిత్తూరు అర్బన్: నగరంలోని 39వ డివిజన్‌లో ఉన్న మునిసిపల్ పాఠశాల విద్యార్థులకు మేయర్ అముద విద్యా సామగ్రి కిట్లను అందచేశారు. పెద్ద హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పిల్లలకు కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనం అందించాలని ఆదేశించారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు

రహదారులపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఆదమరిచి వాహనాలను నడిపితే అనుకోని అనర్థాలే. వెదురుకుప్పం మండలంలోని ప్రధాన రహదారుల్లో ప్రయాణించాలంటే ప్రజలు భీతిల్లిపోతున్నారు. అత్యవసరమని ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చి వాహనాలను నడిపారో ఇక అంతే సంగతులు... గమ్యం చేరడం గగనమే. ఒక్క క్షణం ఏమరుపాటుగా ఉన్నా నేరుగా యమలోకానికి చేరుకోవడం ఖాయమని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకర మలుపుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అసలే ఇరుకు రోడ్లతో ఇక్కట్లు పడుతన్న నేపథ్యంలో ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపులు, రోడ్ల పక్కన బావులు ఉండడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. కనీసం ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు, ఎలాంటి హెచ్చరికలు బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల పాలవుతున్నారు. – వెదురుకుప్పం

- కానరాని సూచిక బోర్డులు
- రహదారుల పక్కన కరువైన రక్షణ గోడలు
- అధికారుల అలసత్వం.. ప్రాణాలతో చెలగాటం



పాతగుంట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బావి



దేవళంపేట రోడ్డులో ప్రమాదకర మలుపు

మండలంలో ప్రధానంగా వెదురుకుప్పం నుంచి దేవళంపేట వైపుగా చిత్తూరుకు, వెదురుకుప్పం నుంచి తిరుపతికి, వెదురుకుప్పం నుంచి పెనుమూరు, పచ్చికాపల్లం, కార్వేటినగరం మీదుగా పుత్తూరుకు ప్రధాన రహదారులు ఉన్నాయి. పచ్చికాపల్లం నుంచి తిరుపతి వరకు రోడ్డు విస్తరించి ఉంది. అయితే దేవళంపేట, పెనుమూరు–కార్వేటినగరం రోడ్లు విస్తరణకు నోచుకోలేదు. పచ్చికాపల్లం నుంచి దేవళంపేట మీదుగా కొత్తపల్లెమిట్ట, పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం రోడ్డు మరమ్మతుకు గురవడంతో అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మరమ్మతు పనులు చేయించారు. అయితే రహదారుల్లో ఎక్కడ చూసినా ప్రమాదకర మలుపులు, రోడ్ల పక్కన బావులు ఉన్నాయి. ఆదమరిచి వాహనాలను నడిపితే ఎలాంటి ప్రమాదాలను చవిచూడాల్సి వస్తుందో ఊహించలేకపోతున్నట్లు వాహనదారులు అంటున్నారు. వెదురుకుప్పం మండల కేంద్రం నుంచి దేవళంపేట వరకు సుమారు 16 చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. పెరుమాళ్లపల్లె సమీపంలో రోడ్డు పక్కనే బావి ఉంది. తిరుమలయ్యపల్లె, పెరుమాళ్లపల్లె, పెద్దబైలు సమీపంలో రహదారికి ఆనుకుని చెరువులు ఉన్నాయి. ఇదిలా ఉండగా వెదురుకుప్పం నుంచి పెనుమూరు వైపు ఎక్కడ చూసినా రోడ్డు పక్కనే బావులు ఉన్నాయి. పాతగుంట సమీపంలోని దోర్ణకంబాల రోడ్డు పక్కన, తాటిమాకులపల్లె రోడ్డు పక్కన, నల్లవెంగనపల్లె వద్ద ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. వెదురుకుప్పం నుంచి పచ్చికాపల్లం వరకు పాలకుంట చేను, దామరకుప్పం వద్ద రెండు చోట్ల బావులు ఉన్నాయి. జక్కిదొన వద్ద రోడ్డును ఆనుకుని చెరువు ఉంది. చెరువు పక్కన ఎలాంటి రక్షణ గోడలు నిర్మించిన పాపాన పోలేదు. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు ధర్మాచెరువు, కసవనూరు, మర్రిమాకుల కండ్రిగ వద్ద మలుపులు ఉన్నాయి.

ఆదమరిస్తే అంతే సంగతులు

గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన ప్రమాదకర మలుపులు, రోడ్డు పక్కన ముళ్ల పొదల చాటున ఉన్న బావులతో ప్రయాణికులు ముప్పుతిప్పలు పడుతున్నారు. క్షణం ఏమారితే ఏగోతిలో పడడమో లేక ఏ చెట్టును ఢీకొట్టడమో జరగడం పరిపాటైంది. మండలంలో ఎక్కువగా మలుపుల వద్ద, చెరువుల వద్ద రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మలుపుల్లో ఎక్కడ కూడా సూచిక గుర్తులు లేవు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ప్రజలు అంటున్నారు. ఆర్అండ్‌బీ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. చెరువుల వద్ద కూడా ఎలాంటి బోర్డులు లేకపోవడంతో రాత్రి పూట వాహనాలు నడిపే చోదకులు అయోమయం చెందుతున్నారు. గతంలో తిరుపతి రోడ్డులోని గోవిందవారిపల్లె బోడిరెడ్డి చెరువులో ఆటో నీళ్లల్లో పడిపోయింది. అదేవిధంగా మద్దెల వంక మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. తంగేటిమిట్ట మలుపు వద్ద బస్సు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు అలసత్వాన్ని వీడడం లేదు. దీనికి తోడు టెలిఫోన్ కేబుల్ అమర్చేందుకు రోడ్డు పక్కన కాలువలు తీశారు. అది వర్షానికి దిగబడిపోతుండంతో ప్రమాదాలకు నిలయంగా మారింది.

వాహనాల్లో వెళ్లలేకున్నాం...



అసలే ఇరుకు రోడ్లు దీనికి తోడు ఎక్కడ చూసినా మలుపులు ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఏమరుపాటుగా వాహనాన్ని నడిపితే ఆస్పత్రి పాలవ్వాల్సిందే. కనీసం ఎదురుగా వచ్చే వాహనాలను కూడా పసిగట్టలేకున్నాం. మలుపుల వద్ద ముళ్ల పొదలు అల్లుకుపోవడంతో వాహనాలను నడపడం ఇబ్బందికరమైంది.

-వెంకటేశ్ సామాజిక కార్యకర్త

అధికారులు పట్టించుకోవడం లేదు



మలుపులు ఎక్కువగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బావులు ఉన్న చోట ప్రమాదకర బోర్డులు లేవు. చెరువుల వద్ద రక్షణ గోడలు లేవు. గతంలో సమస్యను అధికారుల దృష్టి తీసుకొచ్చినా ప్రయోజనం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. స్కూల్ బస్సులు ఒరిగిపోతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు పట్టించుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదు. అధికారులు సమస్యను తీవ్రంగా పరిగణించాలి. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

-గణపతిరెడ్డి, వెదురుకుప్పం.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయంలో 11 రోజులపాటు నిర్వహించిన వార్షిక మహాభారత బ్రహ్మోత్సవాలు సోమవారం వసంతోత్సవాలతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 5 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ వసంతోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన వసంతోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించారు. గాడి హేమాద్రి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉప కోశాధికారి క్రిష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో షుగర్, బీపీ నియంత్రణ



ఎం.అగరంలో రోగులకు పరీక్ష చేస్తున్న వైద్యాధికారి

విజయపురం: ప్రతి రోజూ వ్యాయామం చేస్తే, షుగర్, బీపీ కంట్రోల్‌లో ఉంటాయని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. ఎం.అగరం గ్రామంలో సోమవారం 104 వైద్య సేవలు నిర్వహించారు. డాక్టర్ సోమశేఖర్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అతి చిన్న వయస్సు ఉన్న వారు కూడా షుగర్, బీపీతో బాధ పడుతున్నారని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా షుగర్, బీపీ కంట్రోల్ అవుతుందని తెలిపారు. అలాగే వైద్యుల సలహా మేరకు ప్రతి రోజు క్రమ తప్పకుండా మందులు వేసుకోవాలని సూచించారు.

శుక్రవారం డ్రై డే

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటి తీసుకోవాలన్నారు. వారం రోజులు జ్వరం, జలుబు, దగ్గు ఉన్నట్లయితే రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. మూత్ర విసర్జన తరువాత, భోజనం ముందు సబ్బుతో చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా మూత పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్బరమమ్మ, ఎంపీహెచ్ఓ చింతామణి, మురళి, 104, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్ జయంతి, సెల్వి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీసీసీ బ్యాంకు అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని డీసీసీ బ్యాంకు మేనేజర్ విష్ణు అన్నారు. సోమవారం జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బంగారు రుణాలు, గృహ, వ్యవసాయ, డ్వాక్రాలపై తక్కువ వడ్డీకే మంజూరు చేస్తామన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి, బీమా యోజన పథకం, సురక్ష బీమా యోజన పథకం, అటల్ పెన్షన్ యోజన పథకం, డిజిటల్, లావాదేవీల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా సైబర్ క్రైం మోసాలపై ప్రజలకు అర్థమయ్యేలా ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత మేజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ మణికంఠ, క్యాషియర్ యోగేష్, బ్యాంకు ఉన్నత బ్రాంచ్ అధికారులు గీర్వాణి, రోహిత్, కళాజాత కళాకారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి



మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. సోమవారం నగరి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సరైన జీతాలు లేకపోయినా వంట చేసి, పిల్లలకు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి కార్మికులను మార్చాలని స్థానిక చోటా నాయకులు అనుకోవడం తప్పన్నారు. కార్మికులను రాజకీయ ఒత్తిళ్లు నుంచి కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో వంట చేసే కార్మికులను మార్చాలని కొంత మంది కొన్ని ప్రాంతాల్లో ఒత్తిడి తీసుకొని రావడాన్ని ఏఐటీయూసీగా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యేలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న స్థానిక నాయకులను కార్మికుల జోలికి వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు జమున, వేణి, గిరి, వనిత, సూర్య ప్రభ, స్వర్ణ, స్వప్న, అదిలక్ష్మి, కుప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలతో ఏపీకి గడ్డు పరిస్థితి

పాలసముద్రం: పాలకులు మోదీకి బాంచన్ అంటూ రాజకీయ కుట్రలతో ఏపీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ డి.కన్నన్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆత్మీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డి.కన్నన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానాకు పన్నుల రూపంలో వచ్చే ప్రజాధనాన్ని పాలకులు అవినీతి దాహంతో దారి మళ్లిస్తున్నారని తెలిపారు. వీరి అధికార దుర్వినియోగం అసమర్థ పాలన కారణంగా ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి జీతాలు ఇవ్వలేక పోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ మణికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన గణిత అవధానం



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో సన్మానం

గంగాధరనెల్లూరు: వేపంజేరి హైస్కూల్లో సోమవారం నిర్వహించిన విద్యార్థులు గణిత ప్రజ్ఞ ధారణ కార్యక్రమం పలువురిని అలరించింది. ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరంలో భాగంగా రమారమి దినోత్సవం సందర్భంగా వేపంజేరి హైస్కూల్లో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో గణితంపై ఆసక్తిని పెంచడానికి ఈ కార్యక్రమం చేపట్టారు. సంధానకర్తగా గణిత అవధాన గురువు హెచ్.అరుణ శివప్రసాద్ వ్యవహరించారు. విద్యార్థులు గణితంలో చేసే గారడీలు అసాధారణమని, ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని పలువురు కోరారు. పాపు దేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి స్పందించి హేమ, లహరి, పునీత్‌సాయి మంగళపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కొనియాడుతూ వారికి ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి, వేపంజేరి హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యురాలు స్వప్న జిల్లా కోశాధికారి మనోహర్, ఉత్తమ టీచర్ మునిరెడ్డి, హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు శేషగిరిరావు, జవహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిక్షా సప్తాహ్



విద్యార్థులతో సీడీ, 22/7 ఆకారం

కార్వేటినగరం: మండల పరిధిలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్(విద్యావారోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం కేశవులు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గణిత కరణీయ సంఖ్యపై చారిత్రక విశిష్టతను హెచ్ఎం కేశవులు విద్యార్థులకు తెలియ జేశారు. అలాగే వృత్త పరిధికి, వ్యాసానికి గల నిష్పత్తి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, సోషియల్, గణిత బోధనాభ్యస సామగ్రి సృజనాత్మకత చూపరులను ఎంతో ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులతో సీడీ 22/7 ఆకారాలను అందంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, హరిత, చిన్నయ్యశెట్టి, ఢిల్లీబాబు, వెంకటరమణయ్య, రంజిత్ కుమార్, తిరుమలరాజు, ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ ప్రారంభం



బోధనా సామగ్రిని తిలకిస్తున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా విధానం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, హెచ్ఎం మురళీకృష్ణ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్నా... పాములుంటాయి జాగ్రత్త

- పొలాల్లో పాముల సంచారంపై అప్రమత్తత అవసరం
- నాటు వైద్యంతో ప్రాణానికే ముప్పు
- ఆధునిక వైద్యమే శ్రేయస్కరం



పొలంలో విష సర్పం (ఫైల్)

విజయపురం: ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో రైతులు రాత్రీపగలు తేడా లేకుండా పొలాల్లోనే గడుపుతున్నారు. ఈ సీజన్ లోనే అత్యధిక మంది పాముకాటుకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే పాముల సంచారం అధికంగా ఉంటుంది. అప్పటి వరకు బొరియల్లో ఉన్న పాములు వర్షపు నీరు చేరడంతో ఆహారం సేకరించుకునేందుకు పంట పొలాల్లో సంచారిస్తుంటాయి. అలాంటి సమయంలో పొలం గట్లపై తిరిగే రైతులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పొలం పనులకు వెళ్లే రైతులు గట్లపై నడిచే సమయంలో మోకాళ్ల వరకు ఉన్న పాద రక్షలు ధరించాలి. వీలైనంత వరకు కాళ్ల చెప్పులను కప్పేలా ప్యాంట్లు ధరించడం మంచిది. గజ్జెలు కట్టిన కర్రతో చప్పుడు చేస్తూ నడవడం వల్ల అలికిడికి పాములు దూరంగా వెళ్లిపోతాయి. రాత్రిళ్లు సాగునీటి కోసం మోటార్లు వేసేందుకు పొలానికి వెళ్లే రైతులు తమతో పాటు టార్చిలైటు తీసుకుని వెళ్లాలి. మోటారు స్టార్టర్ వద్ద పాములు ఉండే అవకాశం ఎక్కువ. ధాన్యం గాదెలు, గడ్డి కుప్పలు, కర్రలు, పిడకలు నిల్వ చేసే ప్రాంతాలతోపాటు తేమగా ఉన్న చోట్లకు కప్పలు, ఎలుకలు చేరుతాయి. వాటిని తినేందుకు పాములు అక్కడికే వస్తుంటాయి. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి పిచ్చిమొక్కలు, చెత్తా లేకుండా చూసుకోవాలి. కిటికీలకు, తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పుడూ తలుపులు, కిటికీలు వేసి ఉంచడం మంచిది.

విషం కన్నా భయమే ప్రమాదం

పాము కాటేసిన తర్వాత విషం కంటే భయమే ప్రాణానికి ప్రమాదంగా మారుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తి అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉన్నందున తనకేమీ కాదన్న ధైర్యంతో ఉంటే ఎంతో మేలు జరుగుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి ఎంత త్వరగా ఆధునిక వైద్యం అందిస్తే అంత మంచిది. పసరు మందులు, నాటు వైద్యం, మంత్రం తంత్రాలు అంటూ ఆలస్యం చేయడంతో ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించకూడదు. 108 అంబులెన్స్‌లో తీసుకువెళ్లడం మంచిది. పాము కాటు వేసిన శరీర భాగంలో పైన రక్తప్రసరణ జరగకుండా కట్టు కట్టాలి. అవసరం అనుకుంటే మూడు, నాలుగు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం ఎంతైనా మంచిది.

పాము కాటు ఆనవాళ్లు

- విష సర్పాలు కాటు వేసిన శరీర భాగంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా ఉంటుంది.
- గొంతులో ఏదీ దిగని పరిస్థితి ఏర్పడుతుంది. నోటి ద్వారా చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా మారి శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.
- రెండు గాట్లు పడితే విషపూరితమైన పాము కాటేసినట్లుగా గుర్తించాలి. తాచు కంటే కట్ల పాము ప్రమాదకరం.
- రక్తపింజరి కాటేస్తే విషం రక్తంలో చేరిపోతుంది. నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

వెంటనే వైద్యం అందించాలి



పాటు కాటు వేసిన వెంటనే ఆలస్యం చేయకుండా ముందు సమీపంలోని ఆస్పత్రిలో చేర్చాలి. అక్కడ విషానికి విరుగుడు మందు ఇస్తారు. పాము కాటుకు గురైన వ్యక్తిని తరలించడంలో ఆలస్యం చేయకూడదు. ఆలస్యం చేసేకొద్దీ విషం రక్తంలో కలిసి శరీరంలో కొన్ని భాగాలు పని చేయకుండా చేస్తుంది. అలాంటప్పుడు వ్యక్తి ప్రాణాలు కాపాడడం కష్టంగా మారుతుంది. గ్రామాల్లో నాటు వైద్యం చేయడం, పసరు మందులు తాగించడం, మంత్రాలు చేయకూడదు.

- డాక్టర్ సోమశేఖర్, విజయపురం